క్లుప్తంగా

కాళికామాత ఆలయ నిర్మాణానికి విరాళం


చెక్కు అందిస్తున్న శ్రీనివాసరావు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో నిర్మిస్తున్న కాళికామాత ఆలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాసరావు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించే దేవాలయాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆలయ నిర్మాణానికి తనవంతు గా రూ.51,116 విరాళం ప్రకటించారు. ఈమేరకు చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, శీనన్న యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న జీడీ మల్లేశ్

జమ్మికుంట: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో బీజేపీ జెండా ఆవిష్కరించి, పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనను గుర్తు చేస్తూ గడపగడపకు కేంద్ర సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని, ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులు బలపరిచి, ఆమోదం తెలిపారు. స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరె రవి, దొంతుల రాజ్‌కుమార్, పల్లపు రవి, రాజేశ్‌ఠాకూర్, కొలకాని రాజు, ఇటుకాల స్వరూప, మోతె స్వామి, ఎదులాపురం అశోక్, కైలాస కోటి గణేష్, రావుల శ్రీనివాస్, మోడం రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలోని తొమ్మిది, పదో వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, సిబ్బంది, అధికారులు పరిశీలించారు. ఇళ్ల సమూహాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని స్పెషల్ డ్రైవ్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దారి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 8, 10 వార్డుల్లోని 30 కుటుంబాలు నడిచే దారిని కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎగ్గని శ్రీనివాస్ ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. ఆయా వార్డుల్లోకి వెళ్లేందుకు 20 ఫీట్ల రోడ్డు ఉండేదని, అందులో నుంచి 5 ఫీట్లు మురుగుకాలువ నిర్మాణం చేపట్టగా మిగతా స్థలంలో ప్రజలు నడిచేవారన్నారు. పక్కన ఉన్న స్థలం యాజమాని గోడ పెట్టుకున్నాడని, ఇరవై రోజుల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొందరు ప్రజాప్రతినిధులు యాజమానికి సహకరిస్తున్నారని, దారి లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

పరామర్శ

చిగురుమామిడి: మండలంలోని పీచుపల్లి గ్రామానికి చెందిన పోతరవేని రాజయ్య ధాన్యం డబ్బులు అప్పు ఇచ్చిన వ్యక్తి ఖాతాలో పడటంతో తీవ్ర మనస్తాపానికి గురై మూడు రోజుల క్రితం మృతి చెందాడు. గురువారం రాజయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర హాకాఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ .. అధికారపార్టీ నాయకుడు తీవ్రంగా హింసించడంతోనే రాజయ్య మానసికంగా కుంగిపోయాడని, ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడన్నారు. తీసుకున్న అప్పు చెల్లిస్తానని రాజయ్య ఒప్పుకున్నా వినకుండా ధాన్యం డబ్బులను నాయకుడు అన్యాయంగా తన అకౌంట్‌లో వేసుకున్నాడనే విషయాన్ని గ్రామస్తులే చెబుతున్నారని, ఇప్పటికైనా పలువురు అధికారపార్టీ నాయకుల కొమ్ముకాయకుండా న్యాయంగా వ్యవహరించాలన్నారు.

‘హరిత’ సన్నద్ధం

- 23 గ్రామాల్లోని నర్సరీల్లో 2,40,000 మొక్కల పెంపకం
- వెదిర నర్సరీలో లక్ష మొక్కలు
- అధికారుల ప్రత్యేక కార్యాచరణ


రామడుగు నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి


వెదిర నర్సరీలోని మొక్కలు

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం హరిత తెలంగాణ ధ్యేయంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం కోసం అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

మండలంలో...

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో తొమ్మిదో విడుత హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రత్యేకంగా ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లోని నర్సరీల్లో 2,40,000 మొక్కలను పెంచుతున్నారు. గ్రామానికి సుమారు ఇరవై వేల మొక్కల పెంపకం ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.

ప్రత్యేక రక్షణ చర్యలు

నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. కూలీలను పెట్టి ప్రత్యేక రక్షణ చర్యలను తీసుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి మొక్కలు తట్టుకొనేలా గ్రీన్‌నెట్ వేస్తున్నారు. సమయానికి అనుగుణంగా మొక్కలకు నీరుపడుతున్నారు.

వెదిరలో...

సోషల్ ఫారెస్టుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వెదిరలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద నర్సరీని ఏర్పాటు చేసి దాదాపు లక్ష మొక్కల పెంపకం చేపడుతున్నారు. హరితహారంలో జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడానికి అనువుగా అటవీశాఖ అధికారులు మొక్కలను సిద్ధం చేయనున్నారు. అంజీరా, డ్రాగన్ ఫ్రూట్, మల్బరీ, తంగేడ, గులాబీ, చామంతి, లిల్లీ, గోరింటా, పనస, మామిడి వంటి పలురకాల మొక్కలను పెంచుతున్నారు.

మొక్కలు సిద్ధం చేస్తున్నాం



గ్రామంలోని నర్సరీలో ప్రభుత్వం ఇరవై వేల మొక్కల పెంపకం టార్గెట్ ఇచ్చింది. ఇందులో 16 రకాల మొక్కలు పెంచి హరిత హారం కోసం సిద్ధం చేస్తున్నాం.

– రేవంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, రామడుగు

జాగ్రత్తగా చూసుకుంటాం



గ్రామంలో పదేళ్లుగా నర్సరీని నిర్వహిస్తున్నారు. నర్సరీలో పెరిగే ప్రతి మొక్కను జాగ్రత్తగా చూసుకుంటాం. నర్సరీలో లక్ష మొక్కలను పెంచుతున్నాం.

– మల్లారపు శంకరయ్య, నర్సరీ నిర్వాహకుడు, వెదిర

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్

మానకొండూర్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ అన్నారు. మండలంలోని గంగిపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీధర్ హాజరై మాట్లాడారు. రైతులు ఏటా ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల పంట దిగుబడి తగ్గి, నష్టపోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహిస్తోందని, ఎకరాకు 57 మొక్కలు, డ్రిప్ 90 శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు. అంతర పంటలు కూడా సాగు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని సూచించారు. మొదటి నాలుగేళ్లు రూ.4,200 చొప్పున రైతులకు అందజేస్తుందని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ స్వాతి, ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ,సర్పంచ్ శాలిని, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, చలిగంటి సంపత్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలరోజులుగా నిర్వహించిన అమెరికన్ ఇండియా ఫౌండేషన్ వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి వెంకట నరసింహారెడ్డి హాజరై విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం సత్యప్రసాద్, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లపై డీటీఎఫ్ కమిటీ తీసుకునే చర్యలపై తహసీల్దార్ కోమాల్‌రెడ్డి, టౌన్ సీఐ బొల్లం రమేశ్, కౌన్సిల్ సభ్యులతో చర్చించామని, వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నిర్ణయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తెలిపారు. గురువారం పురపాలక సంఘంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హుజూరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని వివిధ రద్దీ ఏరియాలు, ముఖ్యమైన కూడళ్లలో రూ.10 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 2 నుంచి 22 వరకు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పురపాలక సంఘం అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు తీర్మానించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, మున్సిపల్ ఇంజినీర్ సాంబరాజు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

హుజూరాబాద్: భారత రాజ్యాంగ గ్రంథాలను దేశంలోని పౌరులందరికీ ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం డీఎస్పీ(ధర్మ సమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. దేశాన్ని నడిపిస్తున్నది భారత రాజ్యాంగమని, అలాంటి రాజ్యాంగంపై 90 శాతం ప్రజలకు అవగాహన లేదన్నారు. నాలుగువందల మండలాల్లోని తహసీల్దార్లకు ఈ నెల 8న వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేనందునా ధర్నా చేపట్టామని వివరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా ప్రచార కమిటీ నాయకులు రాకేశ్, అశోక్, రాకేశ్, రవికిరణ్, శ్రీనివాస్, మండల ప్రచార కమిటీ సభ్యులు రాజు, వెంకటేశ్, శ్రీనివాస్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ గన్నేరువరం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, రాజయ్య, జానీ, గంగాధర ఆంజనేయులు, మహంకాళి మల్లికార్జున్, నెలకొండ సంపత్, కోశాధికారిగా బొడ్డు భూపతి, ప్రధాన కార్యదర్శులుగా బద్దం కరుణాకర్ రెడ్డి, వెదిర విజేందర్, ఏలేటి మల్లారెడ్డి, గూడ రవీందర్‌రెడ్డి, గుంటుక ఆంజనేయులు, మాడుగుల స్వామిరెడ్డి, బామండ్ల అజేందర్, బొల్లి రవీందర్, సుదగోని శ్రీనివాస్ ఇట్టవేని పర్శరాం, కార్యవర్గ సభ్యులుగా బొజ్జ రాజు, తాడూరి వంశీకృష్ణరెడ్డి, కాంతాల అంజిరెడ్డి, గోట్ల అశోక్, రాపోలు లింగం, కూన అనిల్, కాల్వ సంపత్, వెదిర తిరుపతి, మహిళా సెల్ అధ్యక్షురాలిగా పీచు స్వప్నారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా నూనె అంజలి నియామకమయ్యారు.


కాంగ్రెస్ పార్టీ గన్నేరువరం మండల నూతన కార్యవర్గ సభ్యులు

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన


చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, రంగపేట, అన్నారం, గ్రామాలలో పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఎనిమిదేళ్లలో రాష్ట్రంలోని అభివృద్ధిని వివరించారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి


చెక్కు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

చొప్పదండి: ఆపదలో ఆదుకునే పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. పట్టణానికి చెందిన అనుమండ్ల రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రూ. పదిలక్షల పోస్టల్ బీమా మంజూరైంది. గురువారం చొప్పదండిలో పోస్టల్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి రూ.10 లక్షల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు పోస్టల్ బీమా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి పోస్టల్ బీమా కలిగి ఉంటే ఆపదలో కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐపీబీపీ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మోహన్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, అంజయ్య, మల్లేశం, శేఖర్, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో గురువారం లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సర్పంచ్ తాటికొండ పుల్లాచారి తదితరులు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ ఉన్నత పాఠశాల 2012-13 పదో తరగతి విద్యార్థులు గురువారం స్కూల్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు కళ్యెం చుక్కరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పంచముఖాంజనేయస్వామి ఆలయంలో పూజలు

చిగురుమామిడి: చిగురుమామిడి గ్రామశివారులోని శ్రీ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో గురువారం షష్టితిథిని పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకాధికార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ హుమేశ్‌స్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, జనగాం, జమ్మికుంట, సిద్దిపేట్, కోహెడ, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హుస్నాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, విశ్వనాథం, అమర్, శివ, స్వామి, గణేశ్, వేణు పలువురు పాల్గొన్నారు.


జమ్మికుంట: నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు


చిగురుమామిడి: పంచముఖాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గౌడశెట్టి, పంబాల పూజారుల ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి రేణుక ఎల్లమ్మ తల్లికి మొక్కులు, నైవేద్యం సమర్పించారు. అనంతరం సురమాంబదేవి, కంఠమహేశ్వరస్వామి కల్యాణం, రేణుక ఎల్లమ్మతల్లి, జమదగ్ని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. గౌడకులస్తులు, మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొంగోని వీరన్న, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఆనందంగౌడ్, ఉపాధ్యక్షుడు అయోధ్యగౌడ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్, వెంకటరమణగౌడ్, పైడిపల్లి పెద్ద భీమయ్యగౌడ్, మండల ఎల్లయ్యగౌడ్, బుర్ర సంపత్‌గౌడ్, గౌడ శెట్టి పూజారి తిరుపతి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


మాట్లాడుతున్న ఎస్సై

గంగాధర: వానాకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై అభిలాశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణదారులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రతి వ్యాపారి లైసెన్సు కలిగి ఉండాలని, ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలను అమ్మి రైతులను మోసం చేయొద్దన్నారు.